అమర జవాన్లకు ఘన నివాళి



సుభాష్‌నగర్: గాజులరామారం డివిజన్ కైసర్ నగర్‌లోని డబుల్ బెడ్రూంల సముదాయంలో 'ఆపరేషన్ సిందూర్'లో అమరులైన జవాన్లకు సోమవారం ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో డబుల్‌బెడ్రూంల సొసైటీ ప్రెసిడెంట్ సాదుల వేణు, సాజిద్, రెహమాన్, నాయుడు, యాదగిరి పాల్గొన్నారు.

బాలానగర్ డీసీపీని కలిసిన ఏసీపీ



బాలానగర్ డీసీపీతో ఏసీపీ నరేశ్‌రెడ్డి

జీడిమెట్ల: బాలానగర్ ఏసీపీగా బాధ్యతలు చేపట్టిన పింగళి నరేశ్‌రెడ్డి బాలానగర్ డీసీపీ కె.సురేశ్‌కుమార్‌ను సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ.. నేరాల నియంత్రణకు పకడ్బందీ చర్యలు తీసుకుంటానని పేర్కొన్నారు.

వైభవంగా హనుమాన్ విగ్రహ ప్రతిష్ఠ





అభిషేక పూజల్లో కార్పొరేటర్ జగన్, హనుమాన్ వెండి విగ్రహం

జగద్గిరిగుట్ట: మగ్దూం నగర్‌లోని శివసీతారామాంజనేయ స్వామి ఆలయంలో 4 కిలోల వెండితో తయారు చేసిన హనుమంతుడి విగ్రహాన్ని సోమవారం ప్రతిష్ఠించారు. అభిషేక పూజల్లో స్థానిక కార్పొరేటర్ జగన్‌తో పాటు స్వాములు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి చొరవ చూపండి



ప్రతినిధులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్

కుత్బుల్లాపూర్: షాపూర్‌నగర్‌లోని తన నివాసంలో మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్‌ను వివిధ కాలనీలు, బస్తీల సంక్షేమ సంఘాల ప్రతినిధులు సోమవారం కలిసి పలు సమస్యలను ఏకరువు పెట్టారు. స్పందించిన శ్రీశైలం గౌడ్ మాట్లాడుతూ.. జిల్లా ఇన్‌చార్జి శ్రీధర్‌బాబు సహకారంతో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు, ఆయా సంక్షేమ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

రోడ్డుపై పచ్చని పందిరి వేసినట్టు..



రోడ్డును పచ్చదనంతో కప్పేసిన చెట్లు

సుభాష్‌నగర్: జీడిమెట్ల డివిజన్ రాఘవేంద్ర కాలనీ ప్రధాన రోడ్డుకు ఇరువైపులా కొన్నేళ్ల క్రితం నాటిన మొక్కలు ఏపుగా పెరిగాయి. మండుటెండల్లోనూ ఆ రోడ్డు గుండా వెళ్లేవారికి ఎండ పడకుండా కాపాడడమే కాకుండా ఎంతో ఆహ్లాదాన్ని పంచుతున్నాయి.

ఆదాయంపై దృష్టి పెట్టేనా?

13 పురపాలికల్లో 2025-26లో పన్నుల టార్గెట్ రూ.362.70 కోట్లు

- గతేడాది రూ.353.66 కోట్లకు.. వసూలైంది 80 శాతమే
- ట్రేడ్ లైసెన్సుల జారీ.. ఖాళీస్థలాలు, తదితర పన్ను మదింపుపై కార్యాచరణ



సాక్షి,సిటీబ్యూరో: పట్టణాభివృద్ధితో సహా సిబ్బంది జీతభత్యాలు, తాగునీటి వీధిలైట్లు, పారిశుద్ధ్యం, డ్రైనేజీ వ్యవస్థ నిర్వహణకు ఎంతగానో తోడ్పాటునిస్తున్న వివిధ రకాల పన్నుల టార్గెట్‌పై అధికార యంత్రాంగం లక్ష్యాలను ఖరారు చేసింది.

- నగర శివారుల్లోని 13 పురపాలకసంఘాల్లో 2025-26 ఆర్థిక సంవత్సరంలో వివిధ రకాల పన్నుల వసూళ్ల ద్వారా రూ.362.70 కోట్లు రాబట్టాలని కార్యాచరణ ప్రణాళికకు రూపకల్పన చేయగా.. జిల్లా అధికార యంత్రాంగం ఆమోద ముద్ర వేసింది.
- గతేడాది (2024-25 ఆర్థిక సంవత్సరం)లో నగర శివారు 13 పురపాలక సంఘాల్లో వివిధ రకాల పన్నుల రుపేణా రూ.353.66 కోట్లు లక్ష్యంగా నిర్దేశించుకున్నప్పటికీ, 80 శాతానికి మించి వసూలు చేయలేకపోయాయి. కొన్ని పురపాలక సంఘాలు మాత్రం లక్ష్యాలకు చేరువకావటానికి తీవ్ర ప్రయత్నం చేశాయి. పురపాలికల్లో పన్నుల మదింపు, అక్రమకట్టడాలు, అనుమతిలేని నిర్మాణాలు, లేఅవుట్ల విషయంలో చూసీ చూడనట్లు వ్యవహరిస్తూ.. ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి కొడుతూ.. చేతివాటం ప్రదర్శిస్తున్న పలువురు పుర అధికారులు, సిబ్బంది భరతం పట్టేందుకు అధికార యంత్రాంగం సన్నద్ధమవుతోంది.

పురపాలికల్లో ఇలా..

నగర శివారు మేడ్చల్, మల్కాజిగిరి జిల్లాల్లో బోడుప్పల్, పీర్జాదిగూడ, నిజాంపేట, జవహర్‌నగర్ మున్సిపల్ కార్పొరేషన్లు, పోచారం, ఘట్కేసర్, నాగారం, దమ్మాయిగూడ, తూముకుంట, కొంపెల్లి, దుండిగల్, గుండ్లపోచంపల్లి, మేడ్చల్ మున్సిపాలిటీలు ఉన్నాయి. ఇటీవల ఏడు మున్సిపాలిటీల్లో 28 గ్రామ పంచాయతీలను విలీనం చేస్తూ.. ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంతో పాటు ప్రత్యేక అధికారులను కూడా నియమించింది. ఆదాయం పెరిగిందని భావించినా.. ఆశించిన స్థాయిలో అధికారులు దృష్టి సారించలేరనే విమర్శలున్నాయి.

పన్నుల మదింపుపై...

పురపాలికల్లో ఇప్పటికే కొత్తగా ఇళ్లు నిర్మించుకుంటే అనుమతులు, ఇంటిపన్ను, నల్లా పన్నుల మదింపు వంటివి చేయడంతో పాటు వాణిజ్య, వ్యాపారసంస్థలకు ట్రేడ్ లైసెన్స్ జారీ చేయడం తప్పనిసరి చేసినప్పటికీ, వాటి జారీలో పలువురు ఉద్యోగులు చేతివాటం ప్రదర్శిస్తున్నారు. దీంతో లక్ష్యానికి తగినట్లుగా ఆదాయం రావడం లేదు.

ఆన్‌లైన్ ద్వారా అనుమతులు..

హోటళ్లు, ఆసుపత్రులు, ఇతర షాపింగ్‌మాల్స్ వంటి అన్ని రకాల వ్యాపార సముదాయాలకు ట్రేడ్ లైసెన్స్ అవసరముంటోంది. వీరంతా ఆన్‌లైన్ తర్వాత అనుమతులు పొందుతున్నారు. రహదారులను బట్టి పొడవు, వెడల్పుల ఆధారంగా పన్ను వసూలు చేయాలి. కానీ నగర శివారు పరిధిలో పదుల సంఖ్యలో మాంసం దుకాణాలు ఉండగా.. కొలతలతో సంబంధం లేకుండానే రూ. 1000 చొప్పున నిర్ణయించి, అదనంగా ఒక్కో దుకాణానికి రూ.700 వసూలు చేస్తున్నట్లు ఆరోపణలున్నాయి. ఇతర వ్యాపార, వాణిజ్య సముదాయాల ట్రేడ్ లైసెన్సుల జారీలో కూడా ఇదే తరహాలో వ్యవహరిస్తున్నారు.

రెన్యువల్ లేక...

నగర శివారుల్లో వ్యాపారం నిర్వహించాలంటే పురపాలక సంఘం నుంచి రుసుము చెల్లించి ట్రేడ్ లైసెన్సు పొందాలి. రుసుము విధింపులో ఇటీవల కొత్త విధానం అమల్లోకి వచ్చింది. చదరపు అడుగుకు రూ.5 చొప్పున నిర్ణయించారు. సాధారణంగా షోరూంలు, మిల్లులు, సరకు నిల్వచేసే హోల్‌సెల్ వర్తకుల భవన సముదాయాల విస్తీర్ణం ఎక్కువగా ఉంటోంది. కొత్త విధానంలో మదింపు చేస్తే వీరు రూ.20 వేల నుంచి రూ.50 వేల వరకు చెల్లించాల్సి ఉంటోంది. లైసెన్సు పొందిన వారు కూడా రెన్యువల్ చేసుకోవటానికి వెనకాడుతున్నారు.

ట్రేడ్ లైసెన్సు లేనివెన్నో...

నిజాంపేట మున్సిపల్ కార్పొరేషన్‌లో 4,854 వ్యాపార సముదాయాలకు 2,935 మాత్రమే ట్రేడ్ లైసెన్సులు జారీ చేశారు. పోచారం మున్సిపాలిటీలో 511 వ్యాపార సముదాయాలకు 273 వాటికి మాత్రమే ట్రేడ్ లైసెన్సులు ఉన్నాయి. ఇదే పరిస్థితి మిగతా పురపాలక సంఘాల్లో నెలకొంది.

- బ్యాంకులో రుణం తీసుకున్న వారు తప్పా.. మిగతా వ్యాపార సముదాయాలకు సంబంధించిన వారు ట్రేడ్ లైసెన్సులు పొందటానికి ఆసక్తి చూపడం లేదు. దీంతో పురపాలక సంఘాల ఆదాయానికి భారీగా గండి పడుతోంది. ఈ అంశాలపై అధికార యంత్రాంగం ప్రత్యేక శ్రద్ధ చూపటంతో పాటు కొరఢా ఝులిపించటానికి సిద్ధమవుతోంది. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో పురపాలక సంఘాల వారీగా పన్నుల వసూళ్ల టార్గెట్‌లో గతేడాది, ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి.

పురపాలక సంఘం	ఆర్థిక సంవత్సరం 2024-25(కోట్లల్లో)	2025-26(కోట్లల్లో)
బోడుప్పల్	రూ.32.51 కోట్లు	రూ.31.60 కోట్లు
పీర్జాదిగూడ	రూ35.17 కోట్లు	రూ.38.14 కోట్లు
జవహర్‌నగర్	రూ.14.64 కోట్లు	రూ.15.38 కోట్లు
నిజాంపేట్	రూ.75.21 కోట్లు	రూ.78.08 కోట్లు
పోచారం	రూ.26.38 కోట్లు	రూ.27.71 కోట్లు
తూంకుంట	రూ.17.20కోట్లు	రూ.18.32 కోట్లు
నాగారం	రూ.23.62 కోట్లు	రూ.22.61 కోట్లు
మేడ్చల్	రూ.15.87 కోట్లు	రూ.16.07 కోట్లు
కొంపల్లి	రూ.16.01 కోట్లు	రూ.17.99 కోట్లు
ఘట్‌కేసర్	రూ.12.26 కోట్లు	రూ.11.14 కోట్లు
గుండ్లపోచంపల్లి	రూ.17.26కోట్లు	రూ.21.35 కోట్లు
దమ్మాయిగూడ	రూ.23.20కోట్లు	రూ.23.27 కోట్లు
దుండిగల్	రూ.44.26కోట్లు	రూ.40.99 కోట్లు
మొత్తం	రూ.353.66 కోట్లు	రూ.362.70 కోట్లు

ప్రజావాణిలో 11 ఫిర్యాదులు

కుత్బుల్లాపూర్: జంట సర్కిళ్ల పరిధిలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో 11 ఫిర్యాదులు వచ్చాయి. కుత్బుల్లాపూర్ సర్కిల్ ఉప కమిషనర్ నరసింహకు టౌన్ ప్లానింగ్‌కు సంబంధించి 2, ఇంజినీరింగ్ 3, అదేవిధంగా గాజులరామారం సర్కిల్ ఉప కమిషనర్ మల్లారెడ్డికి ఇంజినీరింగ్ 3, టౌన్ ప్లానింగ్ 1, ఎలక్ట్రిసిటీ 2 ఫిర్యాదులు వచ్చాయి. వీటిని ఆయా శాఖల వారీగా అధికారులకు అందజేసి వారం రోజుల్లో పరిష్కరించాలని ఆదేశించారు.

ఎమ్మెల్యేను కలిసిన నూతన కార్యవర్గ సభ్యులు

కుత్బుల్లాపూర్: సూరారం డివిజన్ టీఎస్ఐఐసీ కాలనీకి చెందిన 'ఎలైట్ కౌంటీ' అపార్ట్‌మెంట్ నూతన కార్యవర్గ సభ్యులు పేట్‌బషీరాబాద్‌లోని క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే వివేకానంద్‌ను సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారిని అభినందించిన ఎమ్మెల్యే ఐక్యంగా ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. కార్పొరేటర్ సత్యనారాయణ, డివిజన్ అధ్యక్షుడు పుప్పాల భాస్కర్, నూతన అధ్యక్షుడు మహమ్మద్ సిద్ధిఖీ, ఉపాధ్యక్షుడు శ్రీనివాస్ రావు, జనరల్ సెక్రెటరీ పిల్లి శంకర్ తదితరులు ఉన్నారు.

పేకాటస్థావరంపై దాడి

కుత్బుల్లాపూర్: పేకాట స్థావరంపై పోలీసులు దాడులు చేసి ఆరుగురు జూదరులను అదుపులోకి తీసుకున్న ఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కొంపల్లిలోని ఎమరాల్డ్ రెసిడెన్సీ బ్లాక్-ఏ లోని ఫ్లాట్ నంబర్ 44లో పేకాడుతున్నారని పోలీసులకు విశ్వసనీయ సమాచారం అందింది. సోమవారం సాయంత్రం 4 గంటలకు అడ్డాపై దాడులు నిర్వహించగా మూడు ముక్కలాడుతున్న వీఎస్ఎన్ రాజు, నర్సింగ్ రావు, మనోహర్, రాఘవరెడ్డి, పడకంటి రాజు, రవీందర్‌రెడ్డి పట్టుబడ్డారు. వారి నుంచి రూ.83.920, మొబైల్ ఫోన్లు, మూడు సెట్ల పేకాట కార్డులు స్వాధీనం చేసుకున్నారు. జూదరులపై కేసు నమోదు చేసి స్టేషన్‌కు తరలించారు.

నాడు నిర్మానుష్యం..నేడు జనసంచారం!

ఐదేళ్లలోనే మారిన శివారు ప్రాంతాల రూపురేఖలు



5 ఏళ్ల క్రితం బహదూర్‌పల్లి నుంచి సూరారం రాజీవ్ గృహకల్పకు వెళ్లే రోడ్డు



ప్రస్తుతం అదే రోడ్డులో జనసంచారం

సుభాష్‌నగర్: నగరం శరవేగంగా విస్తరిస్తున్న నేపథ్యంలో శివారు ప్రాంతాల రూపురేఖలు మారిపోతున్నాయి. దుండిగల్ మున్సిపల్ బహదూర్‌పల్లి నుంచి గ్రీనీస్ మీదుగా సూరారం రాజీవ్ గృహకల్పకు వెళ్లే రోడ్డునే ఇందుకు నిదర్శనంగా చెప్పుకోవచ్చు. ఐదేళ్ల క్రితం బహదూర్‌పల్లి మున్సిపల్‌లో విలీనం కాకముందు గ్రామపంచాయతీగా ఉండేది. అప్పుడు జన సంచారం లేక నిర్మానుష్యంగా ఉండేది. ప్రస్తుతం కిలోమీటర్‌కు పైగా రోడ్లకిరువైపులా విల్లాలు, అపార్ట్‌మెంట్లు అధునాతన అంగులతో భవనాలు, షాపులు, స్కూళ్లు రావడంతో ఆ ప్రాంతం ప్రస్తుతం జన సంచారంతో కిక్కిరిసిపోతోంది.

అర్హుల జాబితాను లాగిన్ ద్వారానే పంపాలి



సాక్షి,సిటీబ్యూరో: రాజీవ్ యువ వికాసం పథకం దరఖాస్తుల పరిశీలన వేగవంతం చేసి అర్హుల జాబితాను సంబంధిత శాఖల అధికారులు లాగిన్ ద్వారానే పంపాలని మేడ్చల్, మల్కాజిగిరి జిల్లా రాజీవ్ యువ వికాస కమిటీ కన్వీనర్, డీఆర్డీఓ సాంబశివరావు అన్నారు. సోమవారం కలెక్టరేట్ వీసీహాల్‌లో రాజీవ్‌యువవికాస పథకం అమలుపై సంబంధిత అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆన్‌లైన్‌లోని ఎక్సెల్ స్ప్రెడ్‌షీట్‌లో ఏరోజుకారోజు వెరిఫికేషన్, పెండింగ్ వివరాలు అప్‌డేట్ చేయాలని కమిటీ కన్వీనర్ పేర్కొన్నారు. రూ.50 వేల నుంచి రూ.లక్ష వరకు దరఖాస్తుదారులకు సిబిల్ వెరిఫికేషన్ అవసరం లేనందున ముందుగా వాటిని పరిశీలించి, బ్యాంక్‌ల ద్వారా సెలెక్ట్ లిస్టును తెప్పించుకుని, కార్పొరేషన్ లాగిన్‌లోకి పంపాలన్నారు. దరఖాస్తుదారుల ఎంపికలో మానిటరింగ్ తప్పనిసరి చేయాలన్నారు. ఏల్డీఎం వెంకటేశ్వరరావు, ఎస్సీ అభివృద్ధిశాఖాధికారి వినోద్‌కుమార్, బీసీ వెల్ఫేర్ అధికారి ఝాన్సీరాణి, జిల్లా ఎస్సీ కార్పొరేషన్ ఈడీ బాబుమోసిస్, జిల్లా వ్యవసాయాధికారి చంద్రకళ, జిల్లా ఉపాధిశాఖాధికారి రాధిక, మత్స్యశాఖాధికారి సుకీర్తన పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై రాజీలేని పోరాటం

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి మండల సీపీఐ నాలుగో మహా సభను శివప్రసాద్ అధ్యక్షతన సోమవారం శ్రీశ్రీనగర్‌లోని నగర సంఘం కమ్యూనిటీ హాల్‌లో నిర్వహించారు. సెక్రటరీ జి. కృష్ణ రిపోర్టు అందజేయగా, ముఖ్య అతిథులుగా మేడ్చల్, మల్కాజిగిరి సీపీఐ కార్యదర్శి సాయిల్‌గౌడ్, జిల్లా సహాయ కార్యదర్శి ఉమా మహేశ్‌గౌడ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రజా సమస్యల పరిష్కారానికి రాజీలేని పోరాటం చేయాలని శ్రేణులు, ప్రజలకు పిలుపునిచ్చారు. అనంతరం 15 మందితో మండల కమిటీ ఏర్పాటు చేసి పలు తీర్మానాలు చేశారు. ఖాళీగా ఉన్న డబుల్ బెడ్రూంలను అర్హులకు కేటాయించాలి.. అర్హులందరికీ రేషన్ కార్డులు అందించాలి.. 100 పడకల ఆసుపత్రిని కేపీహెచ్‌బీలో నిర్మించాలని తీర్మానించారు.

మండల నూతన కమిటీ

కృష్ణ, కె. మనోచారి, కృష్ణాచారి, దావిద్, యు. శివప్రసాద్, కొండలరావు, జి. రాములు, నారాయణ, చంద్రమ్మ, ఉమారాణి, అంజమ్మ, చంద్రమ్మ, నర్సింహ, నరేశ్, చందర్‌ను ఎన్నుకున్నారు. కేపీహెచ్‌బీ కాలనీ సీపీఐ ఇన్‌చార్జిగా యు. శివప్రసాద్‌ను నియమించింది.

సీసీ రోడ్డు పనుల పరిశీలన



పనులు పరిశీలిస్తున్న కార్పొరేటర్ శ్రీనివాసరావు, తదితరులు

ఆల్విన్‌కాలనీ: హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని జలవాయువిహార్ కాలనీలోని సీసీ రోడ్డు పనులను స్థానిక కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావు జీహెచ్‌ఎంసీ ఇంజినీరింగ్ విభాగం అధికారులు, కాలనీ వాసులతో కలిసి సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నాణ్యతా ప్రమాణాలతో పనులు త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ వర్క్ ఇన్‌స్పెక్టర్ మహదేవ్, కాలనీ అసోసియేషన్ సభ్యులు, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

పార్కు స్థలాలు కాపాడాలి

సుభాష్‌నగర్: పార్కు స్థలాలను కబ్జా చెర నుంచి కాపాడాలని కోరుతూ మహదేవపురం కాలనీకి చెందిన ప్రసాద్ ప్రజావాణిలో అధికారులకు సోమవారం ఫిర్యాదు చేశారు. మహదేవపురం, కైలాష్ హిల్స్ కాలనీలో పార్కు స్థలాలు అన్యాక్రాంతమవుతున్నాయని, అనధికారింగా చేపడుతున్న నిర్మాణాలను తొలగించి ప్రజలకు ఉపయోగపడేలా పార్కులను అభివృద్ధి చేయాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. అలాగే గతంలో హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను సంబంధిత టౌన్‌ప్లానింగ్ అధికారులు అమలు చేయడం లేదని, తక్షణమే స్పందించి కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలని విన్నవించారు.

తులసీనగర్ సంక్షేమ సంఘం విస్తృత స్థాయి సమావేశం

మోతీనగర్: తులసీనగర్ సంక్షేమ సంఘం విస్తృత స్థాయి సమావేశం సోమవారం జరిగింది. ఈ మీటింగ్‌లో కె. సురేందర్, ఎంజివి ప్రసాదరావును ఎన్నికల అధికారులుగా ఎన్నుకున్నారు. అనంతరం వారితో చర్చించి ఎన్నికల షెడ్యూల్‌ను విడుదల చేశారు. మే 18, 19 తేదీల్లో నామినేషన్లు, 21న ఉపసంహరణ, 22న గుర్తుల కేటాయింపు, జూన్ 1న ఎన్నికలు ఉంటాయని వారు తెలిపారు. కార్యక్రమంలో సాంబయ్య, బంగారు, సురేశ్, శ్రీనివాస్, సూర్యచంద్ర, శేఖరాచారి, రాములు, హన్మాండ్లు, సత్తమ్మ, కిషన్‌సింగ్, విజయ్, అంకిత్, మోహన్, ఎల్లయ్య, సత్యారెడ్డి, సుందర్ రెడ్డి, దర్శన్, సంతోష్, రాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రమాణ స్వీకారానికి రండి

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి గ్రామంలోని వేంచేసియున్న సీతారామచంద్ర స్వామి ఆలయ కమిటీ సభ్యులు టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగంను ఆయన కార్యాలయంలో సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ప్రమాణ స్వీకారానికి హాజరుకావాలని కోరుతూ ఆహ్వానించారు. కార్యక్రమంలో మాధవరం శ్రీనివాసరావు, తీగల కృష్ణారావు, వెంకట్‌రావు, కొండల్‌రావు, బాలాజీనగర్ డివిజన్ అధ్యక్షుడు కృష్ణ రాజపుత్ పాల్గొన్నారు.

పటేల్‌కుంట పార్కులో వీధి కుక్కల దత్తత

ఆల్విన్‌కాలనీ: పటేల్‌కుంట పార్కులో జీహెచ్‌ఎంసీ వెటర్నరీ వైద్యుల ఆధ్వర్యంలో వీధి కుక్కల దత్తత కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఆల్విన్‌కాలనీ డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేశ్‌గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై దత్తత తీసుకున్నవారికి కుక్క పిల్లలను అందజేశారు. కార్యక్రమంలో సమ్మారెడ్డి, గాజుల రామారం సర్కిల్ వెటర్నరీ ఆఫీసర్ డాక్టర్ నాగార్జున, డిప్యూటీ డైరెక్టర్ వెంకట్ రెడ్డి, డాక్టర్ దీపక్, మురళి, గణేశ్, శ్రీకాంత్, సాయి, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

మగ్దూంనగర్‌లో సీపీఐ మహాసభలు



మాట్లాడుతున్న నియోజకవర్గ కార్యదర్శి ఉమా మహేశ్

జగద్గిరిగుట్ట: మగ్దూంనగర్‌లో సీపీఐ మహాసభలను బీరప్పనగర్, లెనిన్‌నగర్ శాఖల కార్యదర్శి హరినాథ్ రావు, సాయిలు అధ్యక్షతన సోమవారం నిర్వహించారు. నియోజకవర్గ కార్యదర్శి ఉమా మహేశ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా బీరప్పనగర్ శాఖ కార్యదర్శిగా శ్రీనివాస్ చారి, సహాయ కార్యదర్శులుగా దక్షిణామూర్తి, శీను అలాగే లెనిన్‌నగర్ శాఖ కార్యదర్శిగా ఎండీ యూసుఫ్, సహాయ కార్యదర్శిగా సంపత్‌ను ఎన్నుకున్నారు. అనంతరం ఉమామహేశ్ మాట్లాడుతూ.. మూడేళ్లకు ఒకసారి మహాసభలు నిర్వహించి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకోవడం ఆనవాయితీగా వస్తుందన్నారు. ప్రజల పక్షాన పోరాడేది సీపీఐ మాత్రమే అని పేర్కొన్నారు. యువత మతోన్మాద రాజకీయాల ఉచ్చులో పడవద్దని, పేద ప్రజలకు భూమి, విద్య, వైద్యం, ఉపాధి కోసం ఉద్యమించే సీపీఐకి మద్దతు ఇవ్వాలని ఆయన కోరారు. సమావేశంలో మహిళా సమితి జిల్లా అధ్యక్షురాలు హైమావతి, పార్టీ నియోజకవర్గ కోశాధికారి సదానంద, దక్షిణామూర్తి, శ్రీనివాస్, లక్ష్మి, కమలమ్మ, వీరస్వామి, రామ్ రెడ్డి, జంబు, మోహన్, సంపత్, జహంగీర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గౌతమ బుద్ధుడి జయంతి



బుద్ధ జయంతిలో పాల్గొన్న ఎమ్మెల్యే వివేకానంద్

కుత్బుల్లాపూర్: సుభాష్‌నగర్ డివిజన్ సాయిబాబానగర్‌లోని 'నక్షిణ్ బుద్ధ విహార్' ఆలయంలో సోమవారం బుద్ధుడి జయంతిని ఘనంగా నిర్వహించారు. బీఆర్ఎస్ విప్, ఎమ్మెల్యే వివేకానంద్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ.. కోపంతో కాకుండా శాంతి, సహనంతో ప్రపంచాన్ని జయించవచ్చన్నారు. మానవాళికి దిశానిర్దేశం చేసిన గొప్ప మార్గదర్శకుడు గౌతమ బుద్ధుడు కొనియాడారు. కార్యక్రమంలో జిల్లా ఫిషరీస్ కో-ఆపరేటివ్ చైర్మన్ మన్నె రాజు, బుద్ధ ఆలయ కమిటీ అధ్యక్షుడు యశ్వంత్ జోన్డేల్, ఉపాధ్యక్షుడు భీమ్ రావు కాండే, ప్రధాన కార్యదర్శి దిలీప్, గౌతమ్, డబ్ల్యూ దమ్మానం, కె.బాలాజీ, పెద్ద వెంకట స్వామి, గుబ్బల లక్ష్మీనారాయణ, కావలి రవి తదితరులు పాల్గొన్నారు.

కనుల పండువగా కల్యాణోత్సవం



కల్యాణోత్సవం ఎదుర్కోలులో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు

రంగారెడ్డినగర్: అభయాజంనేయస్వామి సహిత శ్రీరాజరాజేశ్వరి నాగలింగేశ్వర స్వామి ఆలయంలో స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవం సోమవారం కనుల పండువగా జరిగింది. ఉదయం 9 గంటలకు స్వామి, అమ్మవార్లకు అభిషేకం, కుంకుమార్చన నిర్వహించారు. అనంతరం పుర వీధుల గుండా మేళాతాళాలు, డప్పు చప్పుళ్ల మధ్య స్వామివారికి ఎదుర్కోలు కార్యక్రమం చేపట్టారు. 11 గంటలకు వేద పండితుల మంత్రోచ్చరణల మధ్య కల్యాణం జరిగింది. మధ్యాహ్నం 12.30 గంటలకు ఆలయ ప్రాంగణంలో భక్తులకు అన్న సంతర్పణ, అనంతరం రుత్విక్ సన్మానం, ఆశీర్వచన కార్యక్రమాలు నిర్వహించగా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఆగని డెబ్రిస్ డంపింగ్..!



నెహ్రూనగర్ సమీపంలో డంప్ చేసిన భవన వ్యర్థాలు

రంగారెడ్డినగర్: ప్రధాన రహదారులకిరువైపులా భవన వ్యర్థాల డంపింగ్ కొనసాగుతూనే ఉంది. ఓ పక్క అధికారులు డంపింగ్‌కు అడ్డుకట్ట వేసేందుకు ఎన్ని చర్యలు చేపడుతున్నా సత్ఫలితాలు మాత్రం ఇవ్వడం లేదు. రంగారెడ్డినగర్ డివిజన్ పరిధిలోని ఐడీపీఎల్-జగద్గిరిగుట్ట రహదారిలోని నెహ్రూనగర్ సమీపంలో డంపింగ్ మాఫియా రాత్రి వేళల్లో ట్రాక్టర్లలో సిమెంట్, ఇటుక వ్యర్థాలను రోడ్డు పక్కనే డంప్ చేస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి డంపింగ్‌కు పాల్పడుతున్న వారిని గుర్తించి కట్టడి చేయాలని వారు కోరుతున్నారు.